

పంటు సేవలు పునరుద్ధరణ

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం పట్టణం - సఖినేటిపల్లి గ్రామాల మధ్య ప్రజా రవాణా చేసే పంటు సేవలను సోమవారం నుంచి అధికారులు పునరుద్ధరించారు. గోదావరికి వరద ఉధృతి ఎక్కువగా ఉండడంతో అధికారులు కొద్దిరోజుల నుంచి పంటు సేవలు నిలిపివేశారు. గోదావరికి వరద ఉధృతి తగ్గుముఖం పట్టడంతో తిరిగి వాటి పునరుద్ధరణకు అనుమతిచ్చామని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ వికె.వీరభద్రరావు తెలిపారు. దీంతో నిర్వాహకులు పంటు సేవలు పునరుద్ధరించారు.



గోదావరిలో పంటు

నూనెలు 'సలసల'..!



వంట నూనెలపై దిగుమతి సుంకం 20 శాతం పెంపు

లీటర్‌కు రూ.15 నుంచి రూ.20కు పెరిగిన పరిస్థితి

ప్రతి కుటుంబంపై నెలకు రూ.వందకుపైగా భారం

పామాయిల్ రైతులకు ప్రయోజనం స్వల్పమే

టన్నుకు రూ.18 వేలు మద్దతు ధర డిమాండ్ పక్కకు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వంటనూనెల ధరలు సలసలా కాగుతున్నాయి. వంటనూనెల దిగుమతులపై 20 శాతం సుంకం పెంపుతో సామాన్యులపై పెనుభారం పడే పరిస్థితి ఏర్పడింది. మోడీ సర్కార్ వచ్చిన తర్వాత గడిచిన పదేళ్లలో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయి. వంటనూనెల ధరలు లీటర్ రూ.180 వరకూ పెరిగిన పరిస్థితి ఉంది. ఎన్నికల సమయంలో దిగుమతి సుంకం తగ్గించడంతో నూనెల ధరలు కొంతమేర తగ్గాయి. ఎన్నికల ప్రక్రియ ముగియడంతో మళ్లీ మోడీ సర్కార్ దిగుమతి సుంకాన్ని ఐదు నుంచి 20 శాతానికి పెంచింది. దీంతో వంటనూనెల ధరలు మార్కెట్‌లో విపరీతంగా పెరిగాయి. ప్రస్తుతం లీటర్ పామాయిల్ నూనె ధర వంద నుంచి రూ.115కు, సన్‌ఫ్లవర్ లీటర్ రూ.115 నుంచి రూ.130, వేరుశెనగ లీటర్ రూ.155 నుంచి రూ.165 ఇలా ప్రతి లీటర్ వంటనూనెపై రూ.15 నుంచి రూ.20 వరకూ ధరలు పెరిగాయి. దిగుమతి సుంకం పెంచిన వెంటనే పాత స్టాక్ ధరలూ పెంచి వ్యాపారులు వసూలు చేస్తున్నారు. పెరిగిన వంటనూనెల ధరలు చూసి సామాన్య ప్రజానీకం బెంబేలెత్తిపోతున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 40 లక్షల జనాభా ఉండగా పది లక్షల వరకూ కుటుంబాలు ఉన్నాయి. ప్రతి కుటుంబం నెలకు తక్కువగా లెక్కించినా నాలుగు లీటర్ల నూనె ప్యాకెట్లను ఉపయోగిస్తారు. పెరిగిన ధరలతో ఒక్కో కుటుంబంపై నెలకు రూ.వంద వరకూ భారం పడనుంది. ఎక్కువగా ఉపయోగించే కుటుంబాలకు ఈ భారం మరింత పెరగనుంది. గడిచిన ఎన్నికల్లో ధరల పెరుగుదల తీవ్ర ప్రభావం చూపింది. వంటగ్యాస్, కందిపప్పు, మినపప్పు, పెసరపప్పు, వంటనూనెల ధరలు, పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలపై జనం నుంచి తీవ్ర నిరసన వ్యక్తమైంది. ఈ ప్రభావం కారణంగా మోడీ సర్కార్ గడిచిన ఎన్నికల్లో అత్తెసర సీట్లతో బయటపడింది. ధరల పెరుగుదల రాష్ట్రంలో వైసిపి సర్కార్‌ను సైతం కుదిపేసింది. విద్యుత్, ఆర్‌టిసి ఛార్జీల పెంపుతోపాటు, కేంద్రం పరిధిలోని పప్పులు, ముడి చమురు ధరల పెరుగుదల ప్రభావం వైసిపిని వెంటాడింది. దీంతో రాష్ట్ర ప్రజలు మే 13న జరిగిన ఎన్నికల్లో వైసిపిని చిత్తుగా ఓడించిన పరిస్థితి తెలిసిందే. వంటనూనెలపై దిగుమతి సుంకం పెంపును కూటమిలోని టిడిపి ప్రజాప్రతినిధులు గొప్పగా చెప్పుకోవడం అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. దిగుమతి సుంకం పెంపుతో వంటనూనె ధరలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడతారనే విషయం మరిచిపోయి.. పామాయిల్ రైతులకు మేలు జరుగుతుందని కొత్త వాదన తీసుకురావడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది.

పామాయిల్ రైతులకు మేలు ఎంత?

వంటనూనెలపై దిగుమతి సుంకం పెంపుతో పామాయిల్ పంట ధర పెరుగుతుందని, జిల్లా రైతాంగానికి మేలు జరుగుతుందని టిడిపి ప్రజాప్రతినిధులు మీడియా సమావేశం పెట్టి మరీ ప్రచారం చేయడం ఆశ్చర్యం కలిగిస్తోంది. జిల్లాలో దాదాపు లక్షా 45 వేల ఎకరాల్లో పామాయిల్ సాగు ఉంది. మెట్ట ప్రాంతంలో అతిపెద్ద సాగు పామాయిల్‌నే. రాష్ట్రంలో మరెక్కడా లేనివిధంగా పెదవేగిలో ఆయిల్‌ఫెడ్ పామాయిల్ ఫ్యాక్టరీ సైతం ఉంది. 2022 మే నెలలో టన్ను పామాయిల్ ధర రూ.23,400కు పెరిగింది. దీంతో రైతులు ఎంతగానో ఆనందించారు. పామాయిల్ ధర పెరగడంతో కౌలు నుంచి అన్ని ధరలూ పెరిగిపోయాయి. 2023, 2024ల్లో పామాయిల్ టన్ను ధర అమాంతం రూ.13,800కు పడిపోయింది. దీంతో రైతులు తీవ్ర నష్టాలను చవిచూశారు. అంతర్జాతీయ మార్కెట్‌తో సంబంధం లేకుండా టన్ను పామాయిల్ ధర రూ.18 వేలు ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. కేంద్రంలోని మోడీ సర్కార్ పామాయిల్ రైతుల గోడును ఏమాత్రం పట్టించుకోని పరిస్థితి ఉంది. వంటనూనెల దిగుమతి సుంకం 20 శాతం పెంచడంతో దేశీయ నూనె ఉత్పత్తుల ధర కొంతమేర పెరగనుంది. మన దేశానికి అత్యధికంగా నూనె దిగుమతి చేస్తున్న దేశాల్లో అర్జెంటీనా, బ్రెజిల్, రష్యా, ఉక్రెయిన్ ఉన్నాయి. దిగుమతి సుంకం పెంపుతో దేశీయ పామాయిల్‌కు టన్ను ధర రూ.16 వేలు పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తూ టిడిపి ప్రజాప్రతినిధులు గొప్పగా చెబుతున్నారు. వంటనూనె ధరలు పెరగడంతో రైతుల ఇబ్బందుల గురించి మాత్రం మాట్లాడటం లేదు. రైతులకు కొంతమేర ప్రయోజనం చేకూరినప్పటికీ మద్దతు ధర విషయంలో మాత్రం న్యాయం జరగలేదు. అంతర్జాతీయ మార్కెట్లో ఏవైనా మార్పులు జరిగితే మళ్లీ పామాయిల్ ధర పడిపోనుంది. అంతర్జాతీయ మార్కెట్‌తో సంబంధం లేకుండా మద్దతు ధర రూ.18 వేలు ఇవ్వాలన్న రైతుల డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకున్నప్పుడే ప్రజలకు, రైతులకు మేలు జరుగుతుంది. టిడిపి ప్రజాప్రతినిధులు పామాయిల్‌కు మద్దతు ధర వచ్చేలా కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం ఒత్తిడి తీసుకురాగలిగినప్పుడే రాష్ట్రం, జిల్లాలోని పామాయిల్ రైతులకు మేలు జరుగుతుంది.

నేటి నుంచి స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు

జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం



జిల్లాలో ఈ నెల 17 నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకూ స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. అక్టోబర్ 2న స్వచ్ఛ భారత్ దివాస్ జరపనున్నట్లు తెలిపారు. స్వభావ్ స్వచ్ఛత - సంస్కార్ స్వచ్ఛత నినాదంతో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 17న ప్రారంభోత్సవం ఉంటుందని, 18 నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకూ పలు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. స్వచ్ఛతా హి భగీదరిలో భాగంగా తల్లి పేరుతో ఒక మొక్క నాటడం, మెప్మా, డ్వాక్రా, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో స్థానిక స్వచ్ఛతా కార్యక్రమాలపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యుత్, నీరు ఆదా, ప్లాస్టిక్ నిరోధం, తాగునీరు క్లోరినేషన్ చేయడం, ఆరోగ్యకరమైన జీవితం, తదితర అంశాలపై అవగాహన కలిగించనున్నట్లు తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం, పార్క్‌లో, గ్రామంలో సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేయడం, సాలిడ్ వేస్ట్ భవనాలకు పెయింటింగ్ చేయడం, అన్ని విద్యాసంస్థల్లో స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించడం స్వచ్ఛ పంచాయత్, వార్డుల్లో పోటీలు, ర్యాలీలు, మానవహారం నిర్వహించడం కార్యక్రమాలు జరుగుతాయన్నారు. విద్యార్థులు తయారుచేసిన వస్తువులను గాంధీ జయంతి రోజున ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి ఆకర్షణీయ వస్తువులు తయారు చేసినవారికి నగదు బహుమతులు అందిస్తామన్నారు. సఫాయి మిత్ర సురక్ష శివిర్ కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరోగ్య సేవలు, పారిశుధ్య పనివారిని గుర్తించి పిపిఇ కిట్లను అందించడం, ప్రభుత్వ పథకాలను అందించడం, లబ్ధిదారుని ఆయా పథకాలకు మాపింగ్ చేయడం, మొబైల్ హెల్త్ క్యాంపుల నిర్వహణ, సఫాయి మిత్రలకు ఆరోగ్య అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. బాలల సురక్షా కార్యక్రమాలు, వాక్సినేషన్ డ్రైవ్, పోషకాహార పంపిణీ, హెల్త్ ఇన్సురెన్స్ నమోదుకు సహకారం, స్కిల్ డెవలప్మెంట్ వర్క్ షాప్స్, చివరిగా సన్మాన కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

నేడు సీతారాం ఏచూరి సంస్మరణ సభ

సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - భీమవరం

భీమవరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో ఈ నెల 17వ తేదీ మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు సిపిఎం ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి సంస్మరణ సభ నిర్వహించనున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం తెలిపారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, వామపక్ష, లౌకికవాద పార్టీల నాయకులు, ప్రజాసంఘాలు, అభ్యుదయవాదులతో పాటు ప్రజలంతా ఈ సంస్మరణ సభలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు బలరాం సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సిపిఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి, ఉత్తమ పార్లమెంటేరియన్, ఆదర్శ ప్రజానాయకుడు సీతారాం ఏచూరి సంస్మరణ సభను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత సిపిఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఏచూరి ఈ నెల 12వ తేదీన అనారోగ్యంతో ఆసుపత్రిలో మృతి చెందారని తెలిపారు. ఆదర్శ ప్రజానాయకుడు, ఉత్తమ పార్లమెంటేరియన్, దేశంలో పేరుగాంచిన గొప్ప కమ్యూనిస్టు యోధుడు సీతారాం ఏచూరి అని కొనియాడారు. దేశ రాజకీయాల్లో ముఖ్యపాత్ర పోషించి ప్రజా ఉద్యమాలకు దిక్సూచిగా ఏచూరి నిలిచారన్నారు. ఏచూరి రెండు సార్లు రాజ్యసభ సభ్యునిగా దేశంలో సామాన్య ప్రజలు రైతులు, శ్రామికులు, కార్మికులు ఎదుర్కొనే అనేక సమస్యలను పార్లమెంటులో తనదైన శైలిలో లేవనెత్తేవారని గుర్తుచేశారు. విద్యార్థి దశలోనే దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా ఉన్న జెఎన్‌యుకు విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా వరుసగా మూడు సార్లు ఎన్నికైన ఏకైక నాయకుడు ఏచూరి అని కొనియాడారు. అంతేగాకుండా అదే యూనివర్సిటీకి ఛాన్సలర్‌గా ఉన్న ఐరన్ లేడీగా ప్రసిద్ధి చెందిన ఇందిరాగాంధీ చేత రాజీనామా చేయించిన ఘనత ఆయనకే దక్కుతుందని తెలిపారు. ఏచూరి మరణం దేశంలో ప్రజా ఉద్యమాలకు, వామపక్షాలకు, లౌకికవాద పార్టీలకు తీరనిలోటని పేర్కొన్నారు. సీతారాం ఏచూరి ప్రజా ఉద్యమాల్లో చేసిన కృషిని స్మరించుకోవడం మన కర్తవ్యంగా భావించాలని తెలిపారు. దీనిలో భాగంగానే ఈ నెల 17వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు భీమవరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ హాల్లో సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రపంచంలో ఎనిమిదో వింత జగన్ పాలన

అభివృద్ధి పనులను పరిశీలించి అధికారులకు దిశా నిర్దేశం - మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలో వంద పడకల ప్రభుత్వాసుపత్రి, ఎన్‌టిఆర్ కళాక్షేత్రం, రామగుండం పార్కు, శంభుని చెరువు, బరేల్ గ్రౌండ్, గౌడ, శెట్టిబలిజ కళ్యాణ మండపం పనులను జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు సంబంధిత అధికారులతో కలిసి సోమవారం పరిశీలించి, అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంతో పాటు పాలకొల్లు నియోజకవర్గం 20 ఏళ్లు వెనక్కి వెళ్లిందని, అడుగడుగునా విధ్వంసాలు, అభివృద్ధి శూన్యంగా కనబడుతోందన్నారు. ప్రపంచంలో ఏడు వింతలు తెలుసని, ఎనిమిదో వింత జగన్ ఐదేళ్ల పాలన అని విమర్శించారు. ఐదేళ్లలో వంద పడకల ఆసుపత్రి, ఎన్‌టిఆర్ కళాక్షేత్రం, షాదీఖానా, గౌడ శెట్టిబలిజ కళ్యాణ మండపం, అబ్దుల్ కలాం పార్క్, రామగుండం పార్కు, తాగునీటి పథకాల పనులు, అంబేద్కర్ భవనం, బరేల్ గ్రౌండ్స్ తదితర వాటికి మెయింటెన్స్ లేక, నిర్మాణాలు జరగక అన్నీ గాలికి వదిలేశారని తెలిపారు. పాలకొల్లు వైద్య రంగానికి పెద్దపీట వేసి, ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలందించే ఉద్దేశంతో 1998లో సిఎం చంద్రబాబు 30 పడకల ఆసుపత్రి నుంచి 50 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసినట్లు తెలిపారు. 2019లో 50 పడకల ఆసుపత్రి నుంచి వంద పడకలుగా అప్ గ్రేడ్‌గా చేస్తూ నాబార్డు సాయంతో రూ.12.60 కోట్ల నిధులు మంజూరు చేయించామని మంత్రి తెలిపారు. సంవత్సరంలో పూర్తి కావాల్సిన హాస్పిటల్ ఐదేళ్లయినా పూర్తి కాలేదన్నారు. ప్రారంభం కాక ముందే రిపేర్లు, ప్యాచ్ వర్కులు చేసుకోవడం దురదృష్టకరమన్నారు. ప్రతివారమూ రివ్యూలు, క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, అధికారులకు ఎప్పటికప్పుడు తగు ఆదేశాల జారీ చేస్తూ, ప్రత్యేకంగా ఒక కన్సల్టెంటును నియమించి పనులు వేగంగా చేస్తున్నామన్నారు. ఎన్‌టిఆర్ టిడ్కో గృహాలే తన తొలి ప్రాధాన్యత అని తెలిపారు. ఆనాడు సిఎం చంద్రబాబు టిడ్కో గృహాలు రాష్ట్రంలో 8 లక్షలు, పాలకొల్లులో 7,164 మంజూరు చేసి 95 శాతం పూర్తి చేశామన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో మిగిలిన 5 శాతం పూర్తి చేయలేకపోయిందని విమర్శించారు. వచ్చేవారం పురపాలక శాఖా మంత్రి పొంగులేటి నారాయణ పాలకొల్లు టిడ్కో గృహాల వద్దకు తీసుకొచ్చి పరిశీలన చేయించి, అధికారులతో రివ్యూ పెట్టించి సాధ్యమైనంత తొందరగా గృహాలకు మిగిలిన బ్యాలన్స్ పనులు పూర్తి చేయిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, ఎపి మెడికల్ కార్పొరేషన్ ఇఇ బివి.గిరి, డిఇ ఎం.శ్రీనివాసరెడ్డి, పురపాలక సంఘం కమిషనర్ బి.విజయసారధి పాల్గొన్నారు.



మున్సిపల్ పార్కును పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల

డంపింగ్ యార్డు స్థలం పరిశీలన

ప్రజాశక్తి - నరసాపురం

రుస్తుంబాద గ్రామం మండావారిపేటలో డంపింగ్ యార్డు కోసం కేటాయించిన స్థలాన్ని సోమవారం ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా డంపింగ్ యార్డును తమ గ్రామంలో ఏర్పాటు చేస్తే ఏర్పడే ఇబ్బందులు, సమస్యలను గ్రామస్తులు ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం గ్రామస్తులతో ఆయన మాట్లాడుతూ ఎవరూ ఆందోళన చెందొద్దని, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని తెలిపారు. సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళతానని అన్నారు. ప్రజలందరి సహకారంతో త్వరలో ప్రజలందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి బందెల భారతి రవీంద్ర, కాసా సత్యనారాయణ, కర్రి రాంబాబు, వలవల నాని, ఆకన చంద్రశేఖర్, పులి భుజంగరావు, వాతాడి కనకరాజు, వట్టిప్రోలు సతీష్ పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ నాయకర్

దొరగారి చెరువును వినియోగంలోకి తెస్తాం

ఎంఎల్‌ఎ రఘురామకృష్ణంరాజు

ప్రజాశక్తి - ఆకివీడు

దొరగారి చెరువును 60 నుంచి 90 రోజుల్లోగా తాగునీటి చెరువుగా మార్చి వినియోగంలోకి తీసుకొచ్చి ప్రజలకు తాగునీరు అందిస్తామని ఎంఎల్‌ఎ రఘురామకృష్ణంరాజు చెప్పారు. సోమవారం ఎంఎల్‌ఎ దొరగారి చెరువును పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. సుమారు 20 సంవత్సరాలు పైబడి ఈ చెరువు వినియోగంలో లేకుండా పోయిందని తెలిపారు. వెంటనే చెరువును వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. చెరువు చుట్టూ అత్యవసరమైన ఆక్రమణలను వెంటనే తొలగిస్తామన్నారు. గతంలో చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు పనులు ప్రారంభించి మధ్యలో నిలిపివేశారని, పనులను తిరిగి ప్రారంభిస్తామని తెలిపారు. ఐ.భీమవరం రోడ్లో పంట కాల్వలపై నివాసితులు కోర్టును ఆశ్రయించారని, కోర్టు ఆదేశించిన ప్రకారమే వారిని ఖాళీ చేయిస్తామని తెలిపారు. ఆ మేరకు చెరువు గట్టు పైన కాలువ గట్టుపైన ఇల్లు లేని వారికి ప్రత్యామ్నాయ స్థలాలు వెంటనే చూపిస్తామన్నారు. ఇళ్లు ఖాళీ చేసినవారికి నాలుగు నెలలు అద్దె ఇళ్లల్లో ఉండేందుకు 6000 రూపాయల నగదు కూడా అందిస్తామన్నారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు మొటిపల్లి ప్రసాద్, వంట గణపతి, కౌన్సిలర్ వీర శ్వేత, జనసేన నాయకులు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్..!

చెరువుగట్టు పై నిబంధనలకు విరుద్ధంగా ఆలయ నిర్మాణం

అధికారులకు కొప్పర్తి సుబ్రహ్మణ్యేశ్వర రావు, మణిరత్నమాల దంపతుల ఫిర్యాదు

చర్యలు తీసుకోలేదంటూ ఆవేదన



ఫిర్యాదు పత్రాలను చూపుతున్న సుబ్రహ్మణ్యేశ్వర రావు, మణిరత్నమాల దంపతులు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

నిబంధనలకు విరుద్ధంగా ఆలయం నిర్మించొద్దని జిల్లా కలెక్టర్ ఆదేశాలిచ్చినా కింది స్థాయి అధికారులు పట్టించుకోవడం లేదని భీమవరం మండలం గూట్లపాడుకు చెందిన కొప్పర్తి సుబ్రహ్మణ్యేశ్వరరావు, మణిరత్నమాల దంపతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ ఇంటికి సమీపంలో అమ్మవారి ఆలయాన్ని పంచాయతీ చెరువుగట్టుపై అనుమతులు లేకుండా నిర్మించడంపై సుబ్రహ్మణ్యేశ్వరరావు, మణిరత్నమాల దంపతులు సోమవారం భీమవరంలో విలేకరులతో మాట్లాడారు. గూట్లపాడులో చెరువు గట్టుపై ఎటువంటి అనుమతులు లేకుండా ఆలయ నిర్మాణం చేపట్టడంపై నాలుగు నెలలుగా అధికారులకు ఫిర్యాదు చేస్తూనే ఉన్నామన్నారు. ఈ ఆలయ నిర్మాణంపై రెండు వారాల క్రితం పలువురు గ్రామస్తులతో కలిసి జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహూల్ కుమార్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి ఉదయబాస్కర్, డిపిఒ విక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. జిల్లా కలెక్టర్ నాగరాణిని కలిసి సమస్యను వివరించామని తెలిపారు. అనుమతి లేకుండా ఆలయం నిర్మించడంపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలు ఇచ్చినా కూడా దిగువ స్థాయి అధికారులు కనీసం పట్టించుకోవడం లేదన్నారు. ఆలయ ప్రాంతంలో పంచాయతీ అధికారి ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు ఉన్నా ఆలయ నిర్మాణ పనులు చేపట్టడం, రాత్రికి రాత్రికి ఆలయంలో విగ్రహాలు పెట్టే కార్యక్రమాలు చేస్తున్నారని తెలిపారు. స్థానిక, మండల స్థాయి అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదని తిరిగి జాయింట్ కలెక్టర్‌కు పిర్యాదు చేశామన్నారు. ఆలయ నిర్మాణంపై హైకోర్టులో పిటీషన్ వేశామని, కోర్టులో కేసు విచారణలో ఉందని తెలిపారు. ఆలయ నిర్మాణ పనుల్లో భాగంగా పంచాయతీ చెరువుగట్టుపై ఉన్న వందేళ్ల నాటి భారీ వృక్షాన్ని కూడా ఎటువంటి అనుమతులు లేకుండా తొలగించారని తెలిపారు. వీటన్నింటిపై నాలుగు నెలలుగా అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా బాధ్యులపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని తెలిపారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా ఆలయం నిర్మిస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని సుబ్రహ్మణ్యేశ్వరరావు, మణిరత్నమాల దంపతులు కోరుతున్నారు.

ఎల్‌బి చర్లలో పోలీస్ పికెట్

గణేష్ నిమజ్జనం ఊరేగింపులో రెండు సామాజిక తరగతుల మధ్య ఘర్షణ

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని ఎల్‌బి చర్ల గ్రామం బైనపాలెం సెంటర్లో ఆదివారం రాత్రి గణేష్ నిమజ్జనం ఊరేగింపులో రెండు సామాజిక తరగతుల మధ్య తలెత్తిన వివాదం ఉద్రిక్తతలకు దారితీసింది. ఊరేగింపు సాగుతున్న సమయంలో ఒక పాట వేయడాన్ని మరో సామాజిక తరగతి అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో ఇరు సామాజిక తరగతుల మధ్య జరిగిన వాగ్వివాదం ఘర్షణకు దారితీసింది. ఇరువురు పరస్పర రాళ్లతో దాడులు చేసుకున్నారు. దాదాపు మూడు గంటల పాటు గ్రామంలో హైటెన్షన్ నెలకొంది. ఈ క్రమంలో ఇద్దరు పోలీసులతో పాటు పలువురికి గాయాలయ్యాయి. ఈ దాడిలో గ్రామానికి చెందిన తిరుమాని రాజేష్ గాయపడ్డాడు. గాయపడిన రాజేష్‌ను స్థానికులు నరసాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దాడిలో మొగల్తూరుకు చెందిన కానిస్టేబుల్ కూడా గాయపడ్డారు.

స్థానికుల కథనం ప్రకారం.. గ్రామంలో నాలుగు రోజుల క్రితం గణేష్ ఊరేగింపు సందర్భంగా ఒక సినిమా పాట వేయడాన్ని గ్రామంలోని మరో సామాజిక తరగతి అభ్యంతరం వ్యక్తం చేసింది. తరువాత గ్రామ పెద్దలు ఈ పాట వేయొద్దని ఆదేశించారు. ఆ రోజు వివాదం సద్దుమణిగింది. అయితే ఆదివారం సాయంత్రం మరో సామాజిక తరగతి అదే పాట వేస్తూ ఊరేగింపుగా వెళ్తుండగా మళ్లీ ఆ సామాజిక తరగతి అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో ఇరువురి మధ్య ఘర్షణ జరిగింది. సమాచారం అందుకున్న రూరల్ సిఐ జి.దుర్గాప్రసాద్, మొగల్తూరు, నరసాపురం రూరల్ ఎస్ఐలు జి.వాసు, వెంకట సురేష్ సంఘటనా స్థలానికి చేరుకుని ఇరుగ్రూపులతో మాట్లాతుండగా వారు పరస్పరం రాళ్లు విసురుకున్నారు. ఈ దాడిలో నరసాపురం రూరల్ సిఐ వాహనం గ్లాస్ పగిలింది. సమాచారం అందుకున్న సిఐ, ఎస్ఐలు, ప్రత్యేక బలగాలు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పరిస్థితి అదుపులోకి రావడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. సంఘటనా స్థలాన్ని ఎఎస్‌పి వి.భీమారావు, డిఎస్‌పి మురళీకృష్ణ, ఎస్‌బి సీఐ డి.వెంకటేశ్వరరావు, పోలీసు సిబ్బంది గ్రామానికి చేరుకుని పరిస్థితి చక్కదిద్దారు. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్తగా పలు ప్రాంతాల్లో పికెట్లు ఏర్పాటు చేశారు. గ్రామంలో సోమవారం పలు సెంటర్లలో పోలీసులు, స్పెషల్ పార్టీ బలగాలు మోహరించారు. నరసాపురం డిఎస్‌పి ఎన్‌బికె.మురళీకృష్ణ, రూరల్ సిఐ జి.దుర్గా ప్రసాద్ తనిఖీ చేశారు.



ఎల్‌బిచర్లలో పోలీసుల మోహరింపు

సమస్యల వలయంలో పెనుగొండ కాలనీలు..!

ప్రజాశక్తి - పెనుగొండ

మేజర్ పంచాయతీ అయిన పెనుగొండలో మౌలిక సదుపాయాలు లేకపోవడంతో కాలనీవాసులు నానా అవస్థలు పడుతున్నారు. పంచాయతీలోని ఇందిరా శాంతినగర్, రాజ్ గూడెం, ఎర్ర నారాయణస్వామి కాలనీ, దక్షిణపేట మారమ్మ గుడి వద్ద డ్రెయినేజీల నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. ఇటీవల కురిసన వర్షానికి కోడిపందేలదిబ్బ కాలనీలో రోడ్లన్నీ జలమయమై 300 కుటుంబాల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అనేకసార్లు పంచాయతీ దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేదని స్థానికుడు మాదాసు నాగేశ్వరరావు వాపోయాడు. కాలనీవాసులే రోడ్లపై గుంతల్లో నిలిచిన నీటిని దారి మళ్లిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వాలు మారుతున్న సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. అలాగే కాలనీని తాగునీటి సమస్య పట్టిపీడిస్తోందని, గతంలో పంచాయతీ వారు ట్యాంకులతో నీరు సరఫరా చేసేవారని, ప్రస్తుతం పూర్తిగా నిలిపివేశారని తెలిపారు. సమస్యను పరిష్కరించాలని ఆయా కాలనీ వాసులు కోరుతున్నారు.



ఇందిరా కాలనీలో అధ్వానంగా ఉన్న డ్రైనేజీ

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు ఆహ్వానం

ప్రజాశక్తి - ఆకివీడు

మండలంలోని ఆంధ్రకేసరి ప్రకాశం శతజయంతి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రసాయన శాస్త్ర అధ్యాపక పోస్ట్ ఖాళీగా ఉందని ఆ కళాశాల ప్రిన్సిపల్ టి.శ్రీనివాసరావు తెలిపారు. ఆ స్థలానికి గెస్ట్ లెక్చరర్ పోస్ట్ భర్తీ చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎంఎస్‌సి కెమిస్ట్రీలో 55 శాతం మార్కులతో ఉండి, గతంలో పనిచేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. సెల్ నెంబర్ 9381899633 కు సంప్రదించాలని కోరారు.

రైల్వేలో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఇండియన్ రైల్వేలో కొలువుల సాధన కోసం ఎదురు చూసే నిరుద్యోగులకు ఆ సంస్థ వివిధ కొలువుల నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈమేరకు సంస్థలో నాన్ టెక్నికల్ పాపులర్ కేటగిరీ కింద గ్రాడ్యుయేట్, అండర్ గ్రాడ్యుయేట్ అభ్యర్థులకు ఆర్ఆర్‌బి 8,113 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. అందులో గూడ్స్ ట్రైన్ మేనేజర్‌కు 3,144, టికెట్ సూపర్వైజర్ 1,736, టైపిస్ట్ 1,507, స్టేషన్ మాస్టర్ 994, సీనియర్ క్లర్క్ 732 పోస్టులు, మొత్తం 8,113 పోస్టులు ఉన్నాయి. డిగ్రీ అర్హతతో 18-36 ఏళ్ల లోపు వారు ఈనెల 14 నుంచి అక్టోబర్ 13 వరకు అప్లై చేసుకోవాలని ఆ శాఖ కోరింది.



సత్యనారాయణను పరామర్శిస్తున్న టిడిపి మండల శాఖ అధ్యక్షుడు నాగరాజు

సత్యనారాయణకు పరామర్శ

ప్రజాశక్తి - మొగల్తూరు

టిడిపి రామన్నపాలెం గ్రామ అధ్యక్షుడు బొక్క సత్యనారాయణ ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. మాజీ జెడ్‌పిటిసి సభ్యులు, టిడిపి మండల శాఖ అధ్యక్షుడు గుబ్బల నాగరాజు సోమవారం సత్యనారాయణ ఇంటికి వెళ్లి పరామర్శించారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పాల రాంబాబు, బొల్ల చంటి, కుక్కల రవి ఉన్నారు.



అన్నసమారాధనలో పాల్గొన్న ప్రజలు

మొగల్తూరులో అన్నసమారాధన

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులోని ముక్కువారి వీధిలో సోమవారం రాత్రి భారీ అన్న సమారాధన నిర్వహించారు. వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన అన్న సమారాధనలలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. అన్న సమారాధనలో పాల్గొన్న ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వహణ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

కోలాహలంగా వినాయక ఊరేగింపు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

శ్రీఉమా సోమేశ్వర గునుపూడి భీమవరం బ్రాహ్మణ సమాఖ్య, పురజనుల నిర్వహణలో శ్రీవిద్యా గణపతి నవరాత్రుల మహోత్సవంలో భాగంగా నిమజ్జన ఊరేగింపు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ముందుగా పూజా కార్యక్రమాలను చేపట్టి గునుపూడి వీధుల్లో స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. గునుపూడి ఆడపడుచులు, మహిళా సంఘం సభ్యులు ఊరేగింపులో కోలాటం చేస్తూ సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు వేలూరి హనుమ కిరణ్, మారెళ్ల అఖిలేష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎంఎల్‌సి ఎన్నికల ఏర్పాట్లపై సమావేశం

ప్రజాశక్తి - కాళ్ల

తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా ఉపాధ్యాయ ఎన్నికలకు సంబధించి కాళ్ల తహశీల్దార్ కార్యాలయంలో గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కాళ్ల ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఇ.నాగార్జున అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(మెయిన్), ఫస్ట్ క్లాసు రూమ్‌లో(గ్రౌండ్ ఫ్లోర్)లో నిర్ణయించుట గురించి, ఏర్పాటు చేయనున్న పోలింగ్‌బూత్‌ల వివరాలను వెల్లడించారు. ఈ సమావేశానికి టిడిపి మండల నాయకులు పెంటపాటి నాగేశ్వరావు, సిపిఎం మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ, బిజెపి మండల అధ్యక్షులు సుంకర కాశి పాల్గొన్నారు.

నాగరాజుకు పరామర్శ

ప్రజాశక్తి - మొగల్తూరు

మాజీ జెడ్‌పిటిసి సభ్యులు, టిడిపి మొగల్తూరు మండల శాఖ అధ్యక్షులు గుబ్బల నాగరాజును ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ పరామర్శించారు. నాగరాజు తండ్రి సుబ్బారావు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఈ సందర్భంగా ఆయన పరామర్శించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఆయన వెంట మాజీ ఎంపిపి కత్తిమండ ముత్యాలరావు, మామిడిశెట్టి సత్యనారాయణ, బొల్ల చంటి, పాల రాంబాబు, చెల్లబోయిన పెద్దిరాజు తదితరులున్నారు.

గల్ఫ్ యువ నేస్తం సేవాసమితి సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - నరసాపురం

గల్ఫ్ యువనేస్తం సేవాసమితి వారి సేవలు అభినందనీయమని రుస్తుంబాద గ్రామ సర్పంచి బందెల భారతి అన్నారు. మండలంలోని రుస్తుంబాద మంగళగుంట పాలెంకు చెందిన గోరింకల అలీవర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. అలీవర్ ఆరోగ్య నిమిత్తం గల్ఫ్ యువ నేస్తం సేవా సమితి తరుపున రూ.20 వేలు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి పాటి రవికుమార్ విచ్చేశారు. ఈ కార్యక్రమంలో శెట్టిబలిజ యువసేన ట్రెజరరీ గుత్తుల వాసు, పట్టపు ముకేశ్‌కుమార్, సభ్యులు నాగరాజు, సత్తిబాబు, రమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం-పాలకొల్లు రూట్లో లాకు దిగువన 216 జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డు ప్రాంతానికి చెందిన గునిశెట్టి నాగులు(35) అనే వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడికి ఇంకా వివాహం కాలేదు. జెసిబి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. దీనికి సంబందించి పట్టణ ఎస్ఐ జయలక్ష్మి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాత్రి 11.30 సమయంలో బైక్‌పై పాలకొల్లు నుంచి నరసాపురం వైపు వస్తుండగా ఎదురుగా వస్తున్న లారీ కింద పడ్డాడన్నారు. లారీ తలపై నుంచి వెళ్లడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. డ్రైవర్ లారీని ఆపకుండా వెళ్లడంతో పోలీసులు విచారించి పాలకొల్లులో అదపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ జయలక్ష్మి తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

తవ్వారు.. వదిలేశారు

ప్రమాదకరంగా కాలువ

పనులు పూర్తి చేయాలని ప్రజల వేడుకోలు

ప్రజాశక్తి - మొగల్తూరు

కాళీపట్నం తూర్పులోని రంగా బొమ్మ సెంటర్ నుంచి మర్రితిప్ప వెళ్లే రహదారికి ఒకవైపున తవ్విన కాలువ ప్రమాదకరంగా మారింది. కాళీపట్నం, కొత్తపేట గ్రామాల్లోని 216 జాతీయ రహదారికి నిర్మించిన పక్కా డ్రెయిన్‌లకు అవుట్ ఫ్లో నిర్మాణం చేయలేదు. దీంతో మురుగు, వర్షపు నీరు రహదారిపై నిలిచిపోతుంది. దీంతో గ్రామంలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్య పరిష్కార నిమిత్తం సమీపంలోని మురుగు డ్రెయిన్ వరకు సిమెంట్ పైప్‌లైన్ నిర్మాణం చేసేందుకు ఇటీవల కాలువ తవ్వారు. పనులు పూర్తి చేయలేదు. దీంతో ఆ కాలువను అలాగే వదిలేశారు. ఆ రహదారి ప్రమాదకరంగా మారింది. జాతీయ రహదారి నుంచి మర్రితిప్ప వైపునకు ఉన్న చెరువులకు మేత రవాణా చేసే వాహనాలు కాలువ వద్ద దిగబడి ప్రమాదకరంగా మారింది. అధికారులు స్పందించి ఆయా పనులను వెంటనే పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



దిగబడిన వాహనం

నేడు నులిపురుగుల నివారణా దినోత్సవం

ఇంటింటికీ మాత్రలు పంపిణీ

ప్రజాశక్తి - మొగల్తూరు

జాతీయ నులిపురుగుల నివారణా దినోత్సవం పురస్కరించుకొని 19 సంవత్సరాల లోపు పిల్లలకు మంగళవారం నివారణా మాత్రలు అందించనున్నామని మొగల్తూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు దినేష్ కుమార్ తెలిపారు. మండలంలోని గ్రామాలు, ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలోని విద్యార్థులకు ఆశా, అంగన్వాడీ, ఎఎన్ఎంల ద్వారా అందించనున్నామన్నారు. 19 సంవత్సరాల లోపు పిల్లలందరికీ నులిపురుగుల నివారణా మాత్రలు అందించే విధంగా చర్యలు చేపట్టామన్నారు.



వైద్యులు దినేష్(ఫైల్)



ఆపరేషన్ చేయించుకున్న వ్యక్తితో అసోసియేషన్ వైద్యులు

ఉచిత కంటి ఆపరేషన్

ప్రజాశక్తి - తణుకు

సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా హస్పటల్ వారి సంయుక్త సహకారంతో ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్‌అహ్మద్ సోమవారం తణుకు వాస్తవ్యుడు ఎ.దుర్గారావుకు ఉచిత కంటి ఆపరేషన్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు అల్లూరి కరుణాకరచౌదరి, కోశాధికారి అర్జి భాస్కరరావు పాల్గొన్నారు.



పశువుల దాన పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజా మనిషి మంత్రి నిమ్మల

కనకాయలంక, పెద్దలంక గ్రామాల ప్రజల హర్షం

ప్రజాశక్తి - యలమంచిలి

ప్రజల బాధలను తన బాధగా భావించి అర్థం చేసుకునే వ్యక్తి మంత్రి నిమ్మల రామానాయుడని కనకాయలంక, పెద్దలంక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశాల మేరకు గత ఆగస్టు నెలలో వరదలు సంభవించిన సమయంలో సుమారు 900 మంది పాడి రైతులకు పశువుల దాన అందించడంతోపాటు రెండు గ్రామాలలోనూ ప్రజలందరికీ బియ్యం, ఐదు రకాల నిత్యావసర సరుకులను రెండు దఫాలుగా పంపిణీ చేశారు. ఈ విధంగా చేయడం గత చరిత్రలో ఎన్నడూ చూడలేదని, ఇది కేవలం మంత్రి నిమ్మల వల్లే సాధ్యమైందని ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

విరాళాల పేరుతో దందా..!

ప్రజాశక్తి - పెనుగొండ

వరద బాధితుల సహాయార్థం విరాళాలు వసూలు చేస్తున్నారని డ్వాక్రా సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకెళితే.. డ్వాక్రా గ్రూపులకు సంబంధించిన యానిమేటర్లు ప్రతి గ్రూపు నుంచి ఒక్కొక్క సభ్యుల దగ్గర వరద బాధితుల విరాళాల పేరుతో రూ.100 చొప్పున వసూలు చేయాలని వెలుగు అధికారులు తీర్మానించారు. కాని యానిమేటర్లు రూ.100 చొప్పున వసూలు చేయకుండా.. దీనికి 200 రూపాయలు వసూలు చేస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై మండల ఎస్‌సిఎం అధికారి ప్రభుదాసు వివరణ ఇచ్చారు. మండలంలో 1657 గ్రూపులు ఉన్నాయని, విజయవాడ వరద బాధితుల నిమిత్తం వంద రూపాయలు అడగమని చెప్పామని అన్నారు. కాని దీనికి రూ.200 వసూలు చేస్తున్న వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఉన్నతాధికారులు విచారణ చేసి డ్వాక్రా మహిళల వద్ద అదనంగా వసూలు చేసిన వారాపై చర్యలు తీసుకోవాల్సిందిగా బాధ్యులు కోరుతున్నారు.

పేదలకు వస్త్రదానం

ప్రజాశక్తి - ఉండి

వరసిద్ధి వినాయక స్వామి ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై మెండుగా ఉండాలని ఉండి ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణరాజు కోరారు. సోమవారం సాయంత్రం ఉండి సాలిపేటలో వేంచేసియున్న శ్రీవరసిద్ధి వినాయక స్వామి 62వ వార్షికోత్సవంలో పాల్గొన్న ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణరాజు 62 మంది నిరుపేదలకు వస్త్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 62 సంవత్సరాల నుంచి సాలిపేట ప్రజలందరూ ఐకమత్యంగా ఉంటూ స్వామివారి వార్షికోత్సవాలు చేయడం, వస్త్రదానం చేయడం అభినందనీయమని శాలిపేట ప్రజలను, యువతను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రఘురామకృష్ణరాజును సాలిపేట ప్రజలు ఘనంగా సత్కరించారు. అనంతరం అఖండ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, నాయకులు మంతెనసాయి లచ్చిరాజు, గురుగుబిల్లి వెంకట సత్యనారాయణ, కునుకు శ్రీనివాస్, ముదునూరి రవి వర్మ, ముదునూరి శ్రీహరి రాజు, గొల్ల విక్టర్ బాబు, కర్రి శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



వృద్ధులకు వస్త్రదానం చేస్తున్న ఎంఎల్ఎ రఘురామ

పితానిని కలిసిన ఎంఆర్‌పిఎస్ నాయకులు

ప్రజాశక్తి - పోడూరు

విదేశీ ప్రయాణం ముగించుకొని తమ గ్రామానికి విచ్చేసిన మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణను ఎంఆర్‌పిఎస్ జిల్లా గౌరవ అధ్యక్షులు కనపాల పెద్దిరాజు కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంఎల్ఎ పితానిని కలిసిన వారిలో జిల్లా అధ్యక్షులు పలివెల పై డియ్యి, జిల్లా ఉపాధ్యక్షులు తొత్తరమూడి శ్రీనివాస్, ఆచంట నియోజకవర్గ అధ్యక్షులు దిగమర్తి వెంకటేశ్వరరావు, వేమవరం మాజీ గ్రామ అధ్యక్షులు పసల సామ్యూల్ పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.



పితానికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంఆర్‌పిఎస్ నేతలు

18న జాబ్ మేళా

ప్రజాశక్తి - పాలకొల్లు

స్థానిక ఛాంబర్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల, వికాస ప్లేస్మెంట్ సర్వీస్, కాకినాడ వారి ఆధ్వర్యంలో ఈనెల 18వ తేదీ బుధవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల చైర్మన్ కెవి.నరసింహారావు, కళాశాల సెక్రటరీ కలిదిండి రామరాజు తెలిపారు. ఈ జాబ్ మేళాలో ఐసాన్ ఎక్స్‌పీరియన్సెస్ కంపెనీలో టెలిసేల్స్ రిప్రజెంటేటివ్, రిప్యూటెడ్ ఫార్మా కంపెనీలో టెక్నీషియన్ కెమిస్ట్ అండ్ హెల్పర్, ఇండో ఎమ్ఐఎమ్, ఇంజి, డిఎస్‌సి, హోండాయ్ మొబీస్ కంపెనీల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఈ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ, ఐటిఐ, డిప్లమో బిఎస్‌సి, బిటెక్, బయోటెక్నాలజీ, మైక్రోబయాలజీ ఉత్తీర్ణులైన 30 సంవత్సరంలోపు స్త్రీ, పురుష అభ్యర్థులు అర్హులు. వీరికి నెలకు రూ.12 వేల నుంచి రూ.18 వేల వరకు జీతం, ఇతర సదుపాయాలు, భోజనం, వసతి, రవాణా ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుందని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 18వ తేదీ బుధవారం స్థానిక ఛాంబర్స్ డిగ్రీ కాలేజీ పాలకొల్లులో ఉదయం 9 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్స్, జిరాక్స్‌లతో సహా హాజరుకావాలని, ఇటువంటి సదావకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, మరింత సమాచారంకు 9849712739, 779937611 నెంబర్లలో సంప్రదించాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు.

పలుచోట్ల లడ్డూ వేలం పాట



నాగేశ్వరరావు దంపతులను సన్మానిస్తున్న ఘంటా కృష్ణ, నాగ దుర్గాదేవి

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం పట్టణం 26వ వార్డు వైఎస్ఆర్ కాలనీలో శ్రీవరసిద్ధి వినాయక స్వామి కమిటీ ఆధ్వర్యంలో 15వ నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు.



ఉండిలో..

వినాయక చవితికి కర్ణా శ్రీను 104 కేజీల భారీ లడ్డును అందించారు. సోమవారం లడ్డు వేలంపాట నిర్వహించగా అంబడిపూడి బాల నాగేశ్వరరావు లడ్డూను రూ.54,100కు పాడుకున్నారు. లడ్డూ పాడుకున్న నాగేశ్వరరావు దంపతులను గంటా కృష్ణ, నాగ దుర్గాదేవి దంపతులు, కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.

పాలకొల్లు రూరల్ : మండలంలోని లంకలకోడేరు శివాలయం వద్ద గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 18వ వార్షికోత్సవ నవరాత్రులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి సమర్పించిన 18 కేజీల లడ్డూ పాటలో గ్రామానికి చెందిన పాలకొల్లు ఎంఇఒ గంగాధర్ శర్మ రూ.54 వేలకు వేలం పాట దక్కించుకున్నారు. మహిళలకు నిర్వహించిన కోవా లడ్డు రూ.20 వేలకు చెకూరి వైష్ణవి దక్కించుకున్నారని ఉత్సవ కమిటీ సభ్యులు మురళీకృష్ణంరాజు, రామకృష్ణ, వెంకటపతి రాజు తెలియజేశారు.

వినాయక లడ్డూలను పాడుకున్న ముస్లిం మహిళ..

ఉండి : ఉండి గ్రామానికి చెందిన షేక్ బిబిలి కుమార్తె షేక్ నసీమ స్థానిక పడవరేవులోని వినాయక చవితి ఉత్సవంలో ఒక భారీ లడ్డును, సీతారాంపేటలో జరిగిన లడ్డూపాటలో రెండు లడ్డూలను దక్కించుకున్నారు. మొత్తం మూడు లడ్డులను సుమారు రూ.35 వేల వరకు ఈ పాటలో పాల్గొని లడ్డూ ప్రసాదం దక్కించుకోవడం జరిగిందని తెలిపారు. కాగా ఉండి సీతారాంపేట వినాయక ఉత్సవాల్లో ఏర్పాటు చేసిన లడ్డూ వేలం పాటలో ఆలయం వద్ద 15 కేజీలు లడ్డును రూ.12,500లకు పాడుకున్నారు. ఉండి ఒకటో వార్డు పడవలరేవులోని 51 కేజీల లడ్డూను రూ.22,500లకు పాడుకొని ఈ వినాయక చవితి ఉత్సవాల్లో మేము సైతం అంటూ ముస్లిం సోదరి షేక్ నసీమా తమ లడ్డూపాట ద్వారా ఆనందాన్ని వ్యక్తం చేశారు. తాను ముస్లిం కుటుంబంలో పుట్టినప్పటికీ హిందూ సాంప్రదాయం అంటే తనకు ఎంతో గౌరవం అని, కులమతాలకు అతీతంగానే తాను ఎప్పుడూ ఉంటానని అన్నారు. ప్రతి సోమవారం తమకు ఇష్ట దైవమైనటువంటి శివాలయానికి వెళ్లి శివుడిని దర్శించుకుంటానని చెప్పారు. అందులో భాగంగానే సోమవారం పడవల రేవులో ఒక లడ్డూను, సీతారాంపేటలోని రెండు లడ్డూలను కలిపి మొత్తం మూడు లడ్డూలను తాను పాట ద్వారా దక్కించుకున్నానని, ఈ లడ్డూ ప్రసాదాన్ని గ్రామంలోని ప్రజలకు పంచుతానని ఆమె ఆనందాన్ని వ్యక్తం చేశారు.



పాలకొల్లు రూరల్..

మహారాజశ్రీ 1వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) తాడేపల్లిగూడెం కోర్టులో

O.S.No.131 of 2024

వాది : అడబాల వెంకటేశ్వరరావు
And
ప్రతివాదులు : 1.తోట సంపత్ కుమార్
1వ ప్రతివాది: తోట సంపత్‌కుమార్, S/o.వెంకటేశ్వరరావు, హిందువు, పురుషుడు, వయస్సు 64 సం॥లు, అడ్వకేటు, డోరునెం.7-24-16, పాతూరు, తాడేపల్లిగూడెం-1, పశ్చిమ గోదావరి జిల్లా.

పై నెంబరు దావాలో O.S.No.131 of 2024 నందు 1వ ప్రతివాది అయిన మీకు దావా సమన్లు కోర్టు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను అనేక పర్యాయములు పంపినను మీరు తీసుకొనక కాలయాపన చేసియున్నారు. కావున శ్రీకోర్టు వారు మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా దావా సమను అమలు చేయవలసినదిగా ఆర్డరు వేస్తూ దావాను ది.27-09-2024 సం॥రం తేదీకి వాయిదా వేసియున్నారు. సదరు వాయిదా రోజు అనగా ది.27-09-2024 తేదీ ఉదయం 10.30 గం॥లకు మీరు స్వయంగా గాని లేక మీ న్యాయవాది గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల సదరు దావాలోని అంశములు మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.
(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

తోట రాంబాబు
తాడేపల్లిగూడెం వాది తరపు న్యాయవాది
తేది.17-9-2024 తాడేపల్లిగూడెం.

మహారాజశ్రీ 1వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) తాడేపల్లిగూడెం కోర్టులో

O.S.No.128 of 2024

వాదులు : 1.కవల ధనలక్ష్మి వగైరా
And
ప్రతివాదులు : 1.తోట సంపత్ కుమార్ వగైరా
1వ ప్రతివాది: తోట సంపత్‌కుమార్, S/o.వెంకటేశ్వరరావు, హిందువు, పురుషుడు, వయస్సు 64 సం॥లు, అడ్వకేటు, డోరునెం.7-24-16, పాతూరు, తాడేపల్లిగూడెం-1, పశ్చిమ గోదావరి జిల్లా.

పై నెంబరు దావాలో O.S.No.128 of 2024 నందు 1వ ప్రతివాది అయిన మీకు దావా సమన్లు కోర్టు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను అనేక పర్యాయములు పంపినను మీరు తీసుకొనక కాలయాపన చేసియున్నారు. కావున శ్రీకోర్టు వారు మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా దావా సమను అమలు చేయవలసినదిగా ఆర్డరు వేస్తూ దావాను ది.27-09-2024 సం॥రం తేదీకి వాయిదా వేసియున్నారు. సదరు వాయిదా రోజు అనగా ది.27-09-2024 తేదీ ఉదయం 10.30 గం॥లకు మీరు స్వయంగా గాని లేక మీ న్యాయవాది గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల సదరు దావాలోని అంశములు మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.
(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

తోట రాంబాబు
తాడేపల్లిగూడెం వాదుల తరపు న్యాయవాది
తేది.17-9-2024 తాడేపల్లిగూడెం.

వేలం ప్రకటన

మహారాజశ్రీ నర్సాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

E.P.No.48/2018 in O.S.No.19/2017

Between:
DHR : చందకరణ రామకృష్ణ
Vs
JDR : జవ్వాది నాగ వెంకట సత్యనరసింహారావు

షెడ్యూలు

Item no.1 : పశ్చిమ గోదావరి జిల్లా, పాలకొల్లు రెవిన్యూ మండలం పరిధిలో పాలకొల్లు సబ్ రిజిస్ట్రారులో చేరిన పాలకొల్లు మునిసిపల్ 19వ వార్డులోని T.S.No.568 లోని చ॥గ॥ 597-5-00లు నివేశన స్థలముకు హద్దులు కొలతలు
తూర్పు అద్దెపల్లి వెంకట సత్యనారాయణ గారి ఆస్థి 45 అ.లు వరకున్ను, మా తాలూకు ఆస్థి 83 అ 6 అం.లు వరకును వెరశి 128 అ 6 అం లు
దక్షిణం: మునిసిపల్ రోడ్డు 36 అ లు.
పడమర : కారుమూరి లలితా సద్గుణ లక్ష్మి గారి మేడ భవంతి 54 అ.లు వరకున్ను, మా తాలూకు ఆస్థి 74 అ 6 అంలు వరుకున్ను వెరశి 128 అ 6 అం లు
ఉత్తరం: మా తాలూకు ఆస్తి 45 అలు
యావత్తు యాజుమెంటు హక్కులతో సహా
Item no.2 : చ గ 954 లు నిర్మిత విస్తీర్ణములో నిర్మాణము గావించబడిన (G+3 type Maha Lakshmi Residency" అపార్టుమెంట్ నందలి Second floor నందలి Flat No.C.2 కు హద్దులు
తూర్పు జుయింట్ కారిడార్
దక్షిణం : ప్లాట్ నెం 01
పడమర : జూయింట్ స్టెయిర్ కేస్ అండ్ జాయింట్ లిఫ్ట్ రూమ్
ఉత్తరం జాయింట్ ఓపెన్ స్పేస్
యీ హద్దుల మధ్య గల నిర్మించబడివున్న అసెస్మెంట్ 1079012556 రు దాఖలా డోర్ నెం.38-3-2/6 గల అప్పార్ట్‌మెంట్ ప్లాటున్ను సదరు ప్లాటు వంటి ఉన్న యావత్తు గృహోపకరణాలు సెల్లారు నందిలి పార్కింగ్ హక్కులు, సదరు అప్పార్ట్‌మెంట్‌కు చెందిన లిఫ్టు, నీటి వాడకం, నడక వగయిరా స్కూటర్ యావత్తు యీజుమెంటు హక్కులు సహా..

పై షెడ్యూల్ దాఖలా ఆస్తిని DHR యొక్క తనకా బాకీ వసూలు నిమ్మిత్తం పై కోర్టు వారు ది. 30-9-2024 సం. తేదిన ఉదయం 10:30 ని. లగాయితు కోర్టులో వేలంలో విక్రయించుదురు. కాబట్టి సదరు వేలంలో పాడుకొనుటకు కోర్టు వారు యీ పేపరు ప్రకటన ద్వార తెలియజేయుచున్నారు. యిందు మూలముగా యావన్మందికి వేలములో పాల్గొనగలందులకు కోరడమైనది.
DHR వాల్యూ రూ.9,00,000/-
అమీనా వాల్యు రూ.27,00,000/-
నర్సాపురం **డి.సుబ్రహ్మణ్యం,** అడ్వకేట్, పాలకొల్లు
15-09-2024 సెల్ : 9849173674